సాక్షి
తిరుపతి
గురువారం । 5 । జూన్ । 2025



ఉగ్రవాదంపై అప్రమత్తంగా ఉండాలి
ఉగ్రవాదంపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తిరుమల అదనపు ఏఎస్పీ రామకృష్ణ తెలిపారు. - 12లో



సబ్సిడీ వేరుశనగ.. కొందరికేనా?
జిల్లాకు సబ్సిడీ వేరుశనగ కాయలు 3,280 క్వింటాళ్లు మాత్రమే రావడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. - 12లో



మన జీవితంలో యోగా భాగం కావాలి
ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో యోగా ఒక భాగం కావాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. - 12లో

వెన్నుపోటుపై జనాగ్రహం





తిరుపతిలో జరిగిన నిరసన ర్యాలీలో భారీగా పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, ప్రజలు (ఇన్‌సెట్) ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న భూమన కరుణాకరరెడ్డి, పార్టీ నాయకులు



పాలకుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

- అందుకే వెన్నుపోటు దినం
- కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడుస్తున్నా సూపర్ సిక్స్ హామీలకు దిక్కులేదు
- ఎన్నికల ముందేమో సూపర్‌సిక్స్ అంటూ ఊదరగొట్టిన చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్
- హామీలు అమలుపై ఎవరైనా ప్రశ్నిస్తే.. అక్రమ కేసులు.. అరెస్టులు.. బెదిరింపులు
- జిల్లావ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ
- పెల్లుబికిన జనసందోహం రావడంతో కూటమి సర్కార్‌కి షాక్

సాక్షి ప్రతినిధి, తిరుపతి : కూటమి ప్రభుత్వ పాలకులపై జనం కన్నెర్రజేశారు. ఏడాది పూర్తవుతున్నా సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకుండా కాలం వెళ్లదీస్తూ వచ్చిన కూటమి పాలకులపై వైఎస్సార్‌సీపీ చేపట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. తిరుపతి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎన్నికల ముందు సూపర్‌సిక్స్‌తో పాటు 143 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏడాదైనా వాటిని అమలు చేయకపోవడంపై జనం, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు తిరుపతి జిల్లావ్యాప్తంగా వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం జరిగింది. చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో తిరుపతి నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని జీవకోన సత్యనారాయణపురం కూడలి నుంచి తిరుమల బైపాస్ రోడ్డులోని మున్సిపల్ పార్కు వరకు సాగిన ర్యాలీకి వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పాటు స్థానికులు భారీగా తరలివచ్చి ఫ్లెక్సీలు, జెండాలు చేతబట్టుకుని కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం తిరుపతి ఆర్డీఓ కార్యాలయం చేరుకుని ఆర్డీఓ రామ్మోహన్‌కి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీష, టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం రామారావు, నగర పార్టీ అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తిరుపతిలో ప్లకార్డులు చేతపట్టుకుని నిరసన ర్యాలీగా వెళ్తున్న భూమన కరుణాకరరెడ్డి, కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మేయర్ శిరీష, మహిళలు


- చంద్రగిరిలో నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీగా ర్యాలీ నిర్వహించారు. స్థానికులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలివచ్చి నిరసన తెలియజేశారు.



- వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రాపూరు పడమర వీధిలోని సిద్ధలయ్య స్వామి ఆలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, వెంకటగిరి మున్సిపల్ చైర్మన్ నక్కా భానుప్రియ తదితరులు పాల్గొన్నారు.



- శ్రీకాళహస్తిలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ప్లకార్డులతో నిరసన తెలియజేశారు. అనంతరం ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని ఇన్‌చార్జ్ అధికారికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మాజీ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


- సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో వరదయ్యపాలెంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- గూడూరులో ఎమ్మెల్సీ మేరిగ మురళి ఆధ్వర్యంలో టవర్‌క్లాక్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలియజేశారు. వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి అన్ని మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు భారీగా తరలివచ్చి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా.. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేష్ బాబుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.


- సూళ్లూరుపేటలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి నిరసన తెలియజేశారు. ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి ప్రారంభమైన ర్యాలీ డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి నిరసన తెలియజేశారు.


ఒరిగిందేమీ లేదు..


కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు వెన్నుపోటు తప్పా మరేమీ ఒరగలేదు. సంక్షేమం సున్నా, అభివృద్ధి సున్నా. ఎన్నికలప్పుడు 143 హామీలతో పాటు సూపర్ సిక్స్ మ్యానిఫెస్టో ఇచ్చారు. అవి ఏమయ్యాయి ? – మేరిగ మురళీధర్, ఎమ్మెల్సీ

వెన్నుపోటు పొడిచారు..

చంద్రబాబు సూపర్ సిక్స్‌తో పాటు అనేక హామీలను ఇచ్చి అధికారంలో వచ్చారు. ఏడాది అవుతున్నా అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్నారు. – కిలివేటి సంజీవయ్య, మాజీ ఎమ్మెల్యే, సూళ్లూరుపేట

అన్ని రంగాలను మోసం..

అన్నీ రంగాల ప్రజలను మోసం చేసింది చంద్రబాబే. ఎన్నికల ముందు రక రకాలా హామీలు చెప్పి గద్దినెక్కి.. ఇప్పుడు ప్రజలను నట్టేట ముంచేశారు. సమస్యలపై ప్రశ్నిస్తానన్న జనసేనాని పవన్‌కల్యాణ్ ఇప్పుడు ఎక్కడ ఉన్నారు ? – నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త

సమాధి కట్టారు..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంక్షేమానికి సమాధి కట్టింది. అధికారం చేపట్టి ఏడాది పూర్తయినప్పటికీ సూపర్‌సిక్స్ పథకాల్లో ఒక్క పథకాన్ని కూడా సరిగా అమలు చేయకుండా కాలయాపన చేస్తూ సీఎం చంద్రబాబు ప్రజలకే వెన్నుపోటు పొడుస్తున్నారు. – నూకతోటి రాజేష్, సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త

ఇకపై నిరంతరం ఉద్యమాలే

కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకపోతే ఇకపై ప్రజల పక్షాన నిలబడి వైఎస్సార్‌సీపీ నిరంతరం ఉద్యమ పోరాటాలు సాగిస్తుంది. అధికారంలోకి రాగానే అవి చేస్తాం.. ఇవి చేస్తామంటూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రగల్భాలు పలికారు. అధికారంలోకి రాగానే వైఎస్సార్‌సీపీ శ్రేణులపై కక్ష సాధింపులకు పాల్పడడం తప్ప ప్రజాసంక్షేమాన్ని పట్టించుకోలేదు. ఏడాది పాలనంతా అరాచకాలు, దాడులు, అక్రమ కేసులు, హత్యా రాజకీయాలే. ప్రజలే రోడ్లపై వచ్చి ఉద్యమించే సమయం ఆసన్నమైంది. కూటమి ప్రభుత్వ ఆగడాలు, అరాచకాలు ఇక సాగవు.
– భూమన కరుణాకరరెడ్డి, వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు

సూపర్ సిక్స్ హామీలు ఏమయ్యాయి?

సూపర్‌సిక్స్‌తో పాటు 109 హామీలిచ్చి నెరవేర్చుతామని ప్రజలకు వాగ్దానాలు చేశారు. హామీలు అమలు చేయకుండా మోసిగించావు. అందుకే ప్రజలే స్వచ్ఛందంగా రోడ్లుపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారు. ఇంకెంత కాలం ప్రజలను మోసగించి వెన్నుపోటు పొడుస్తావ్ చంద్రబాబు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చి హామీలను నెరవేర్చాలి. లేనిపక్షంలో ఉద్యమ పోరాటాలు తప్పవు.
– డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్సీ

బూటకపు మేనిఫెస్టో..

సార్వత్రిక ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పేరిట బూటకపు మేనిఫెస్టో ప్రకటించారు. అధికారం చేపట్టిన మరుక్షణం నుంచే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగలేదంటూ సంక్షేమ పథకాలను గాలికి వదిలేశారు.
– బియ్యపు మధుసూదన్‌రెడ్డి, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే

ఒక్కటైనా నెరవేర్చారా ?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అనేక సంక్షేమ పథకాలను అందిస్తానని చంద్రబాబు నమ్మబలికారు. తీరా అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటైనా నెరవేర్చావా చంద్రబాబు ? – భూమన అభినయ్‌రెడ్డి, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త

బూటకపు మాటలు..

ఎన్నికల ముందు బూటకపు మాటలు చెప్పి ప్రజలను నమ్మించి..తీరా అధికారంలోకి వచ్చాక హామీలు అమలు చేయడానికి ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూ సీఎం చంద్రబాబు కబుర్లు చెబుతున్నారు. అక్కచెల్లెమ్మలకు వెన్నుపోటు పొడిచారు. – చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త

న్యూస్‌రీల్

మొండి బకాయిలపై సమీక్ష

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: ప్రభుత్వానికి కట్టాల్సిన జీఎస్టీ మొండి బకాయిలను వసూలు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో వాణిజ్యపన్నుల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ న్యాయబద్ధంగా కట్టాల్సిన జీఎస్టీ బకాయిలను జాప్యం లేకుండా రాబట్టాలని స్పష్టం చేశారు. అధికారులు సమష్టిగా సమావేశాలు ఏర్పాటు చేసుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచన చేశారు. సమావేశంలో వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ జాన్ స్టివెన్సన్, డిప్యూటీ కమిషనర్ విజయ భాస్కర్, అసిస్టెంట్ కమిషనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

10న జాబ్‌మేళా

జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ

తిరుపతి అర్బన్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 10న నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న జాబ్‌మేళా పోస్టర్‌ను బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ గణేష్ మాట్లాడుతూ ఈ నెల 10న ఉదయం 8 గంటల నుంచి నాయుడుపేటలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పదోతరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. ఆ మేరకు ముందుగా పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అదనపు సమాచారం కోసం 919985056929, 9154449677, 9988853335 సంప్రదించాలని తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు
తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 78,631 మంది స్వామివారిని దర్శించుకోగా, 31,247 మంది భక్తులు తలనీలాలు ఇచ్చారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.29 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, టిక్కెట్లు లేని భక్తులకు 16 గంటల్లో దర్శనం, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

చిన్నారి డిశ్చార్జ్
తిరుపతి తుడా: కోవిడ్ బారిన పడిన పది నెలల చిన్నారి బుధవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. ఏర్పేడు మండలం పాపానాయుడుపేటకు చెందిన 10 నెలల చిన్నారికి కోవిడ్ పాజిటివ్‌గా తేలడంతో రుయా చిన్నపిల్లల ఆస్పత్రిలో చికిత్స అందించారు. చిన్నారి ఆరోగ్యం కుదుట పడడం, కరోనా లక్షణాలు స్వల్పంగా ఉండడంతో కుటుంబ సభ్యులు హోమ్ ఐసోలేషన్‌లో ఉంటామని చెప్పడంతో వైద్యులు తగిన సూచనలు చేసి డిశ్చార్జ్ చేశారు. గడిచిన నెల రోజుల్లో ఇప్పటివరకు జిల్లాలో మొత్తం నాలుగు కోవిడ్ కేసులు నమోదయ్యాయి. స్విమ్స్, రుయా కోవిడ్ కేంద్రాల్లో నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా రెండేసి చొప్పున మొత్తం నాలుగు కేసులు నమోదు అయ్యాయి. కోవిడ్ లక్షణాలు స్వల్పంగా ఉండడంతో చిన్నారి మినహా మిగిలిన ముగ్గురు హోమ్ ఐసోలేషన్‌లోనే చికిత్స తీసుకున్నారు.

విద్యుత్ అంతరాయానికి సహకరించండి

విద్యుత్ ఉపకేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంపు పనులు చేస్తున్న సిబ్బంది

రేణిగుంట: రేణిగుంట 220 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో 100 ఎంవీఏ నుంచి 160 ఎంవీఏకు ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంచే పనులు జరుగుతున్నాయని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కె.శ్రీనివాసన్ బుధవారం తెలిపారు. ఈనెల 5 నుంచి జూలై 9 వరకు 220 కేవీ ఏపీ ట్రాన్స్‌కో రేణిగుంట విద్యుత్ ఉపకేంద్రంలో 100 ఎంవీఏ నుంచి 160 ఎంవీఏకు ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంచే పనులు చేపడుతున్న నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో రేణిగుంట, తిరుపతి, చంద్రగిరి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే అవకాశం ఉందన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.1,00,520
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.9,090

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.1,04,100
రిటైల్ వెండి గ్రాము	రూ.107.10

క్లుప్తంగా

ఎన్‌ఎస్‌యూలో ప్రవేశాలకు రేపటితో గడువు ముగింపు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలో యూజీ, పీజీ, పాక్‌శాస్త్రి (ఇంటర్) కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ గడువు శుక్రవారంతో ముగియనున్నట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా గానీ, వర్సిటీలో ఏర్పాటు చేసి ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జాతీయ స్థాయి ఎంట్రన్స్ పరీక్ష ఎన్‌యూఈటీతో సంబంధం లేకుండా డైరెక్ట్ అడ్మిషన్ల కోసం శాస్త్రి, ఆచార్య కోర్సులకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు పాక్‌శాస్త్రీ (ఇంటర్మీడియట్) కోర్సులో చేరేందుకు ఈనెల 6లోపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.


జీప్ స్వాధీనం

తిరుపతి క్రైమ్: గోవిందరాజ స్వామి సమీపంలోని పద్మావతి స్టాండ్‌లో జీప్ చోరీ కేసును ఈస్ట్ పోలీసులు ఛేదించారు. ఈ నెల రెండో తేదీన గుర్తు తెలియని వ్యక్తులు కోనేరు కట్టమీద సమీపంలో ఉన్న రామచంద్రారెడ్డి జీపును చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేయగా.. బుధవారం సాయంత్రం గోవిందరాజ స్వామి సత్రాల వద్ద జీపును గుర్తించారు. అందులో ఉన్న దొంగ అయిన ఒడిశాకు చెందిన లింగం రాజిరెడ్డిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి జీపు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

ప్రైవేటు పరిశ్రమలో కార్మికుడు మృతి

తడ: మండలంలోని మాంబట్టు ఏపీఐఐసీ పరిధిలోని ఓ ప్రైవేటు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలో బుధవారం జరిగిన ప్రమాదంలో దొరవారిసత్రం మండలం బూదూరు గ్రామానికి చెందిన భాస్కర్(56) మృతి చెందాడు. పరిశ్రమలో పని చేస్తున్న భాస్కర్ అపస్మారక స్థితిలో మెట్లపై పడిపోయి ఉండడం గమనించిన తోటి కార్మికులు యాజమాన్యానికి తెలపడంతో వారు హుటాహుటిన సూళ్లూరుపేట ఆస్పత్రి తరలించారు. భాస్కర్ అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సబ్సిడీ వేరుశనగ.. కొందరికేనా?



ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వేరుశనగ విత్తనకాయలు అందించేందుకు సిద్ధమైంది. అయితే జిల్లాకు 12 వేల క్వింటాళ్ల కాయలు అవసరం కాగా కేవలం 3,280 క్వింటాళ్లే వచ్చాయి. ఈ లెక్కన 30 శాతం మంది రైతులకే కాయలు ఇవ్వనున్నారు. ఎకరాకు ఒక బస్తా.. మూడు ఎకరాల పైన ఎంత భూమి ఉన్నా కేవలం 3 బస్తాలే ఇస్తామని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఈ వచ్చిన కాయల్లో కూడా పచ్చనేతలకే తొలి ప్రాధాన్యం ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ఈసారి ఖరీఫ్‌లో వేరుశనగ సాగు ప్రశ్నార్థకంగా మారింది.

- పచ్చనేతలకే తొలి ప్రాధాన్యత
- జిల్లాలో 10 వేల ఎకరాల్లో ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు
- ఎకరాకు 1.20 క్వింటాళ్లు అవసరం.. అంటే 12 వేల క్వింటాళ్లు ఇవ్వాలి
- కానీ జిల్లాకు వచ్చింది 3,280 క్వింటాళ్లే
- ఎకరాకు ఒక బస్తా.. 3 ఎకరాలకు పైన ఎంత భూమి ఉన్నా గరిష్ఠంగా 3 బస్తాలే
- 40 శాతం రాయితీతో విత్తనకాయలు పంపిణీ చేసేందుకు సన్నాహాలు
- ఆందోళనలో అన్నదాతలు

తిరుపతి అర్బన్: ఖరీఫ్ సీజన్ అనగానే మొదట సాగయ్యే పంట వేరుశనగ. ఈసారి 80 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేయడానికి రైతులు సిద్ధం అవుతున్నారు. ఇప్పటికే 5 నుంచి 10 శాతం వివిధ పంటలు సాగులోకి వచ్చాయి. అందులో ప్రధానంగా వరి సాగు 60 వేల ఎకరాలు, వేరుశనగ పంట 10 వేల ఎకరాలు, ఆరుతడి పంటల్లో ప్రధానంగా నువ్వులు పంట 4 వేల ఎకరాలు, మిగిలిన 6 వేల ఎకరాల్లో జొన్నలు, సజ్జలు, రాగులు, మినుములు, కొర్రలు, అరికలు, సాములు తదితర పంటలు సాగుచేస్తారు.

10 వేల ఎకరాల్లో వేరుశనగ సాగు..

జిల్లాలోని 34 మండలాల్లో తిరుపతి అర్బన్ మినహాయిస్తే మిగిలిన 33 మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో 10 వేల ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేయనున్నారు. 10 వేల ఎకరాల సాగుకు ఎకరాకు 1.20 క్వింటాళ్లు చొప్పున 12 వేల క్వింటాళ్లు వేరుశనగ విత్తనకాయలు అవసరం. అయితే ఈ సీజన్‌కు కేవలం 3,280 క్వింటాళ్లు మాత్రమే వచ్చాయని అగ్రికల్చర్ అధికారులు అంటున్నారు. 30 శాతం మాత్రమే వేరుశనగ విత్తనాలు మాత్రమే జిల్లాకు చేరాయి. రేపోమాపో కూటమి నేతల చేత ప్రారంభోత్సవం చేయించిన తర్వాత పంపిణీ చేయడానికి అగ్రికల్చర్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

పచ్చనేతలకే తొలి ప్రాధాన్యత

30 శాతం మాత్రమే వేరుశనగ కాయలు రావడంతో తొలి ప్రాధాన్యత పచ్చనేతలకే ఇవ్వాలని ఇప్పటికే కూటమి నేతలు అగ్రికల్చర్ అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తుంది. దీంతో నిజమైన రైతులకు నష్టం తప్పదని పలువురు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు కే6, డీసీజీఎస్ 1694 రకాల వేరుశనగ కాయలు మాత్రమే జిల్లాకు వచ్చాయి. మార్కెట్‌లో డిమాండ్ లేని రకాలు వచ్చాయని పలువురు రైతులు విమర్శలు చేస్తున్నారు.

ఆందోళనలో అన్నదాతలు

40 శాతం రాయితీతో విత్తనాలు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. కేజీ వేరుశనగ కాయలు రూ.93. అయితే అందులో సబ్సిడీ 37.20 మినహాయిస్తే కేజీ రూ.55.80 చొప్పున రైతులకు అందజేయనున్నారు. మొత్తంగా 30 కేజీల బస్తా రూ.1674కి రైతులకు అందించనున్నారు. జిల్లాలో 442 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. అయితే అందులో 160 రైతు సేవా కేంద్రాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్లు లేరు. దీంతో కొందరు అగ్రికల్చర్ అసిస్టెంట్లకు రెండు రైతు సేవా కేంద్రాల బాధ్యతలు అప్పగించారు. రైతు పాస్ పుస్తకాల జెరాక్స్‌లను అగ్రికల్చర్ అసిస్టెంట్లకు సమర్పించాల్సి ఉంది. కనిష్ఠంగా ఎకరం భూమి ఉన్న రైతుకు ఒక బస్తా(30కేజీలు).. రెండు ఎకరాలు ఉంటే 2 బస్తాలు, మూడు ఎకరాలు ఉంటే 3 బస్తాలు ఇవ్వాలని నిర్ణయించారు. 3 ఎకరాలకు మించి ఎన్ని ఎకరాలు ఉన్నా గరిష్ఠంగా 3 బస్తాలు మాత్రమే ఇవ్వనున్నారు. అయితే ఒక ఎకరం సాగుకు 30 కేజీల బస్తాలు 4 సంచులు అవసరం అవుతాయి. అంటే 120 కేజీలు ఎకరా పొలంలో పంట సాగుకు అవసరం ఉంటుంది. గరిష్ఠంగా 3 బస్తాలు ఇస్తే ఒక్క ఎకరం కూడా పంటను సాగు చేయలేమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి సర్కార్‌లో రైతులకు కష్టాలు తప్ప.. ప్రయోజనాలు కల్పించడం లేదని పలువురు వాపోతున్నారు. మొత్తంగా రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలు అందుతాయో లేదో రెండు రోజులు వేచి చూడాల్సి ఉంది.

మన జీవితంలో యోగా భాగం కావాలి



చంద్రగిరి కోటలో యోగాసనాలు వేస్తున్న అధికారులు, ప్రజలు

- చంద్రగిరి కోటలో అట్టహాసంగా యోగాంధ్ర
- పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు యువత, మహిళలు, విద్యార్థులు

చంద్రగిరి: ప్రతి ఒక్కరి దైనందిత జీవతంలో యోగ ఒక భాగం కావాలి అని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. బుధవారం చంద్రగిరి కోటలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, ప్రజలు, జిల్లా అధికారులు, విద్యార్థులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా అంతటా యోగాంధ్ర అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. సీఎం పిలుపు మేరకు జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని యోగాంధ్ర క్యాంపెన్‌లో భాగంగా తిరుపతి జిల్లాలోని చంద్రగిరి కోటలో యోగా కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా సుమారుగా 8 లక్షల మందిని రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా యోగా గురువు చెప్పిన విధంగా ఆసనాలను ఆసక్తిగా వింటూ ప్రజలు, అధికారులు, యువత మహిళలు ఆసనాలు వేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ నరసింహులు, తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, జిల్లా పర్యాటక శాఖ అధికారి జనార్ధన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, మండల స్థాయి అధికారులు, మహిళలు, విద్యార్థులు, పాల్గొన్నారు.

పేదల స్థావరాలపై ప్రతాపం

ఏర్పేడు: శ్రీకాళహస్తి మండలం ఇనగలూరులోని పేదలపై టీడీపీ నాయకుల దౌర్జన్యకాండ కొనసాగుతూనే ఉంది. బుధవారం గ్రామానికి చెందిన 30మంది కుండలు తయారు చేసుకునే పేదలు బంకమట్టి నిల్వ చేసుకున్న స్థావరాలను టీడీపీ నేతలు ధ్వంసం చేసి స్థలాన్ని జేసీబీతో చదును చేశారు. స్థానికుల కథనం మేరకు.. గ్రామశివార్లలో ప్రభుత్వ భూమి రెండెకరాలు ఉంది. ఈ స్థలంలో దశాబ్దాల తరబడి కుమ్మరులు బంకమట్టి తెచ్చి అక్కడే నిల్వ చేసుకుని కుండలను తయారుచేసుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే టీడీపీ నాయకులు కక్షపూరితంగా జేసీబీతో చదును చేసేశారు. బాధితులు మాట్లాడుతూ తాము నిల్వ చేసుకున్న మట్టినంతా పల్లపు ప్రాంతాల్లోకి తోసి చదును చేశారని, రెవెన్యూ, పోలీసులకు సమాచారం ఇచ్చినా వారు పట్టించుకోలేదని వాపోయారు. ఉపాధి కోల్పోయిన తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.



ఇనగలూరులో ప్రభుత్వ భూమిలో జేసీబీతో చదును చేస్తున్న దృశ్యం

తప్పిన లక్ష్మీ కాసులు.. చివరకు హుండీలోకి..

కాణిపాకం : కాణిపాక శ్రీవరసిద్ధి వినాయస్వామి దర్శనార్థం వచ్చిన ఓ భక్తురాలు బుధవారం ఆలయంలో లక్ష్మీకాసులు(బంగారు) పాగొట్టుకున్నారు. వివరాలు ఇలా..హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తురాలు బుధవారం స్వామి దర్శనార్థం వచ్చారు. ఈ క్రమంలో ఆమె వద్ద నుంచి రెండు లక్ష్మీ కాసులు కింద పడిపోయాయి. ఇది గమనించిన ఓ హోంగార్డు ఆ రెండు కాసులను తీసి ఓ వ్యక్తి చేతికి ఇచ్చాడు. ఆ వ్యక్తి రెండు కాసుల్లో ఒకటి హుండీలో వేసి..మరో కాసును జేబులో వేసుకున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు స్పందించిన ఆలయ అధికారులు విచారణ మొదలు పెట్టారు. సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఆ కాసుల చేతుల మార్పిడిని గుర్తించారు. చివరకు బాధితురాలికి ఆ ఒక్క కాసును అందించారు. ఆమె ఆ కాసు కూడా వద్దని...అది కూడా దేవునికే అంకితమని...హుండీలో వేసి సంతృప్తిగా వెళ్లిపోయారు. ఇక ఆ కాసులను ఆ హోంగార్డు..ఎందుకు ఆ వ్యక్తికి ఇవ్వాల్సి వచ్చిందనే విషయంపై అధికారులు ఆరా తీస్తున్నారు.

దళిత విద్యార్థిపై దాడి కేసులో నిందితుల అరెస్టు

చంద్రగిరి: బీటెక్ దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడికి పాల్పడి పరారీలో ఉన్న నిందితులను బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు తిరుచానూరు సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. నెల్లూరు జిల్లా రెడ్డిపాలెం గ్రామానికి చెందని జేమ్స్ అనే విద్యార్థి శ్రీవిద్యానికేతన్‌లో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడన్నారు. ఈ క్రమంలో గత నెల 14వ తేదీన అర్ధరాత్రి సమయంలో మంగళం సమీపంలోని ఎస్వీసీఈ వద్ద జేమ్స్‌తో పాటు అతని స్నేహితుడు గురుసాయిరెడ్డి ఒంటరిగా ఉన్నారని తెలుసుకుని యశ్వంత్‌తో పాటు మరికొందరు వారిపై రాళ్లు, కర్రలు, హాకీ స్టిక్స్‌తో దాడికి పాల్పడ్డారన్నారు. అనంతరం వారిని కిడ్నాప్ చేసి పద్మావతిపురం సమీపంలోని ఎలైట్ పార్కు హోటల్ బంధించి మూత్రవిసర్జన చేసి, చిత్రహింసలకు గురిచేయడం జరిగిందని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు.. ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి 1వ తేదీన దాడికి పాల్పడిన 12 మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. మిగిలిన వారి కోసం గాలిస్తుండగా మంగళవారం తిరుచానూరు పోలీసు స్టేషన్ పరిధిలోని పాడిపేట వద్ద గల శేషాద్రి నగర్‌లో ముద్దాయిలు మటం వంశీ అలియాస్ చోటా బ్లేడ్, పసుపులేటి దీపక్, పులి జగదీష్ అలియాస్ జగ్గ, సాయి హరితేజ అలియాస్ సాయి గౌడ్, గడ్డం రూపేష్ అలియాస్ రూపి, ఎనమల సోమశేఖర్ అలియాస్ సోములను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరిలో రూపేష్ అనే వ్యక్తి గతంలో కూడా తిరుపతి ఈస్ట్ పోలీసు స్టేషన్‌లో హత్యాయత్నం కేసులో నిందితుడిగా ఉన్నాడని చెప్పారు. ఇతనిపై రౌడీషీటు ఉందని, అనేక క్రిమినల్ కేసులు నమోదు అయ్యాయని, అదేవిధంగా మటం వంశీ అలియాస్ చోటా బ్లేడ్, జగదీష్ అలియాస్ జగ్గలపై కూడా వివిధ క్రిమినల్ కేసులు నమోదు అయినట్లు తెలిపారు.

తారాస్థాయికి జనసేన నేతల వర్గపోరు

- కార్యక్రమం ఏర్పాట్లలో వివాదం, ఘర్షణ
- ఒకరికి కత్తి పోట్లు



కత్తి దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న సాయి

చిల్లకూరు : గూడూరు నియోజకవర్గంలో జనసేన నేతలు, కార్యకర్తల మధ్య వర్గపోరు తారాస్థాయికి చేరింది. ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా బుధవారం జనసేన నేతలు పలుచోట్ల కార్యక్రమాలు నిర్వహించారు. ఒక వర్గానికి చెందిన వారు బుధవారం రాత్రి టపాకాయలు తీసుకుని వచ్చేందుకు గూడూరు పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్ వద్దకు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న మరో వర్గానికి చెందిన వారు అక్కడికి చేరుకుని వారితో వాగ్వాదానికి దిగారు. మాటామాటా పెరిగి ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో సాయి అనే యువకుడిపై మరో వర్గానికి చెందిన యువకుడు కత్తితో దాడి చేశాడు. అతను తప్పించుకునే ప్రయత్నం చేయగా కాలికి గాయమైంది. దాడికి పాల్పడిన వర్గం వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. తీవ్రంగా గాయపడిన సాయిని స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఒకటో పట్టణ ఎస్‌ఐ తిరుపతయ్య సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయి నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఇటీవల కాలంలో గూడూరు పట్టణంలో అల్లర్లు, దాడులు, ప్రతిదాడులు సర్వసాధారణంగా మారిపోయాయి. రెండు రోజుల క్రితం రెండో పట్టణంలో ఒక వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. దీన్ని మరువకనే జనసేన కార్యకర్తల మధ్య వర్గపోరు జరిగి కత్తితో దాడులు చేసుకునే వరకు రావడంతో పట్టణ ప్రజలు ఎప్పుడు ఏమి జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి గట్టి చర్యలు తీసుకుని శాంతి భద్రతలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ముత్యపు పందిరిపై తేజోమూర్తి



ముత్యపు పందిరి వాహనంపై విహరిస్తున్న గోవిందుడు

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడవ రోజు బుధవారం రాత్రి స్వామివారు ముత్యపు పందిరి వాహనంపై విహరించారు. ఈ సందర్భంగా ఉదయం సింహవాహనంపై స్వామివారు ఊరేగారు. 10 నుంచి 11 గంటల వరకు దేవదేవేరులకు స్నపన తిరుమంజనం వేడుకగా చేపట్టారు. సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, డిప్యూటీ ఈఓ వీఆర్ శాంతి, ఏఈఓ కె.మునికృష్ణారెడ్డి, ఏవీఎస్ఓ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం నిర్వహించిన ధార్మిక, సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

అర్జున్‌దాస్ గది తలుపులు తెరిచిన అధికారులు



అర్జున్‌దాస్ గదిని తెరిచి అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తున్న మఠం పాలనాధికారి బాపిరెడ్డి

తిరుపతి కల్చరల్: శ్రీస్వామి హథీరాంజీ మఠం మాజీ మఠాధిపతి అర్జున్‌దాస్ అధికారిక గది(డోలు)ను దేవదాయశాఖ అధికారులు, మఠం పరిపాలన అధికారి బాపిరెడ్డి, మఠాధిపతి ఓంప్రకాష్‌దాస్ సమక్షంలో బుధవారం తెరిచి పంచనామా నిర్వహించారు. మఠాధిపతిగా అర్జున్‌దాస్ ఉన్నప్పుడు మఠం నిబంధనలకు విరుద్ధంగా పలు అక్రమాలకు, భూములు అన్యాక్రాంతానికి పాలు పడ్డారన్న ఆరోపణల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ధార్మిక పరిషత్ అర్జున్ దాస్‌ను సస్పెండ్ చేస్తూ విచారణకు ఆదేశించింది. ఈమేరకు అర్జున్‌దారు అధికారిక గదిని 2023 జూన్ 8వ తేదీన అధికారులు సీజ్ చేశారు. అప్పటి నుంచి అర్జున్‌దాస్ మళ్లీ మఠాధిపతిగా కొనసాగేందుకు కోర్టుల ద్వారా ప్రయత్నం చేసినా ఫలితం లేదు. మఠాధిపతిగా ఓం ప్రకాష్‌ను ధార్మిక పరిషత్ నియమిస్తూ మఠం ఆధీనంలోని ఆలయాలకు సంబంధించిన కార్యకలాపాలను చూసుకోవాలని పరిషత్ సూచించింది. అర్జున్‌దాస్ అధికార గదిలో ఉన్న వస్తువులు, రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి రికార్డుల్లో నమోదు చేయాలని బాపిరెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ రెవెన్యూ విభాగం స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ డాక్టర్ కె.సత్యవతి, దేవదాయ శాఖ ఆర్‌జేసీ కార్యాలయ తహసీల్దార్ వీఆర్ కృష్ణ, మఠం సూపరింటెండెంట్ కేశవులు, మఠం లా ఆఫీసర్ కవిత, ల్యాండ్స్ క్లర్క్ సీతారామయ్య, మఠం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా మండలి సమావేశానికి వీసీ

తిరుపతి సిటీ : మంగళగిరిలోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వీసీలు, రిజిస్ట్రార్‌ల సమావేశానికి ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు హాజరయ్యారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య మధు మూర్తి, ముఖ్యకార్యదర్శి కోన శశిధర్ ఆధ్వర్యంలో చేపట్టిన సమావేశంలో వర్సిటీల పాలన, పరిశోధనాభివృద్ధి, రీసెర్చ్ పబ్లికేషన్, ప్రపంచ ర్యాంకుల స్థాయి మెరుగుపరచడం, అధ్యాపకుల కొరత, భర్తీ ప్రక్రియ, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు.

దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్‌పై కక్ష

కాణిపాకం : జిల్లా దేవదాయశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ సుమనప్రియ సస్పెన్షన్ వెనుక అంతర్యమేమిటో అనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. మూడు రోజుల కిందట బంగారుపాళ్యం మండలంలోని శ్రీ మొగిలి దేవస్థాన హుండీ లెక్కింపులో చేతివాటం ప్రదర్శించారంటూ కొందరు వ్యక్తులు (కూటమి నేతలు) శనివారం దేవదాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. హుటాహుటిన మరుసటి రోజే దీనిపై ఆ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండానే విచారణకు పిలిచారు. అత్యవసరంగా ఆదివారం విచారణ చేయాల్సిన అవసరం ఏముందని ఆ శాఖ అధికారులే ఓ అధికారి తీరుపై మండిపడుతున్నారు. కక్ష పూరితంగానే సుమన ప్రియను సస్పెండ్ చేయాలని కొందరు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. సాక్షులుగా ఉన్న వ్యక్తులు లెక్కించే సమయంలో సీసీ ఫుటేజీలో ఉన్నారా..? సీసీ ఫుటేజీలో సుమన ప్రియ డబ్బులు తీసుకున్నట్లు ఆధారాలున్నాయా ? అనే విషయాలు అధికారులు దాచి పెట్టినట్లు తెలుస్తోంది. ఒకే సామాజిక వర్గానికి, కూటమి నేతలకు అంటకాగిన కొందరు అధికారులు సుమన ప్రియపై కక్ష కట్టి సస్పెండ్‌కు పూనుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈమెను సస్పెండ్ చేసి కార్యాలయంలో పనిచేసే మరో అధికారికి ఈ సీటును కేటాయించే ప్రయత్నంలో ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు పెద్ద ఎత్తున రాజకీయాలు నడిచినట్లు విమర్శలు వస్తున్నాయి.

ఉగ్రవాదంపై అప్రమత్తంగా ఉండాలి

- టీటీడీ, విజిలెన్స్ అధికారులతో తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న తిరుమల ఏఎస్పీ రామకృష్ణ

తిరుమల : దేశంలో రోజురోజుకు పెరుగుతున్న ఇస్లామిక్, తీవ్రవాదం ఉగ్రవాదం నుంచి తిరుమలను సురక్షితంగా కాపాడుకోవాలని తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం ఆస్థాన మండపంలో టీటీడీ విజిలెన్స్, సివిల్, ఏఆర్ పోలీసులు, ఏపీఎస్పీ, ఎస్పీఎఫ్, ఆక్టోపస్, ఫైర్, బాంబ్ స్క్వాడ్‌తోపాటు టీటీడీ సిబ్బంది అర్చకులు, పోటు కార్మికులు, ట్యాక్సీ డ్రైవర్లు, మఠాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రస్తుతం ఇస్లామిక్ ఫండమెంటలిజం, టెర్రరిజం ద్వారా దాడులకు పాల్పడుతూ దేశసమగ్రతను, భద్రతను దెబ్బతీస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో హిందువుల రాజధానిగా భావించే తిరుమల శ్రీ వేంకటేశ్వర ఆలయాన్ని రక్షించుకునేందుకు ఇక్కడ పనిచేసే అధికారుల నుంచి నాలుగో తరగతి ఉద్యోగుల వరకు అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ఉగ్రవాదులు మనతోపాటు ఉంటూ ఘర్షణలు సృష్టించేందుకు ప్రయత్నిస్తారని, మనమందరం అప్రమత్తంగా ఉంటూ వారి ఆచూకీ గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

అనుమానాస్పద వ్యక్తులపై నిఘా

ప్రతి ఒక్కరూ తాము పనిచేసే ప్రదేశంలో అనుమానాస్పద వస్తువులు, బ్యాగులు, వ్యక్తులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడం ద్వారా విలువైన ప్రాణాలను రక్షించవచ్చునని ఏఎస్పీ తెలిపారు. దేశవ్యాప్తంగా జరిగిన బాంబు దాడులు, వాటిని అమలు చేసిన విధానాన్ని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తిరుమలలో ఉగ్రముప్పును అడ్డుకునేందుకు పటిష్ట భద్రతా ఏర్పాట్లను చేపట్టామని తెలిపారు. అందులో భాగంగానే అక్రమంగా తిరుమలలో ఉంటున్న హాకర్లు, వలసదారులను గుర్తించి 800 మందిని బలవంతంగా తిరుపతికి తరలించామన్నారు. అదేవిధంగా వారు నిర్మించుకున్న 150 షెడ్లను కూల్చివేశామని తెలిపారు. నిరంతరాయంగా భద్రతా చర్యలను కొనసాగిస్తున్నామని చెప్పారు. సమావేశంలో తిరుమల డీఎస్పీ విజయ్ శేఖర్, టీటీడీ వీజీఓ సురేంద్ర, వివిధ భద్రతా విభాగాల అధికారులు పాల్గొన్నారు.



సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR

Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry.9381287629

Wanted

శ్రీ Jobs: తిరుపతిలో మా ఆఫీస్ కొరకు కంప్యూటర్ ఆపరేటర్, HR Recruiters, Accountants, Attenders అర్జెంట్‌గా కావలెను. జీతం 15-25 వేలు.99599 66708, 98485 99889.

GP Electricals, Tirupati Hiring-Walk In-Accountant/System Administrator/ Receptionist, Accountant-Degree with 5Yrs Accountant Exp. Understanding of GST, TDS, ITR along with CA Exp. Audits, Projections, CashFlow, Reconciliations, Ledgers System Admin-Degree, Computer Skills & 3Yrs Exp., Receptionist-Degree, 3Yrs Exp., ✆ 9133309137, Email gurappaparameswara@gmail.com

గూడూరు నుండి అంకుల్ పాటూరు లిబర్టీ SBQ స్టీల్ ప్లాంట్లకు ఇనోవా కారుకు డ్రైవర్ కావలెను. జీతము 15వేలు. సంప్ర॥ 9908515099, 9502006229

కేర్ టేకర్స్ (M/F), నర్సులు, ఆయాలు, విజయవాడలో పేషెంట్ల ఇళ్ళ వద్దనే ఉండి చూసుకొనుటకు, ఆకర్షణీయ జీతం+వ+భో. ఏజెంట్ కమీషన్ 6 వేలు. ✆ 91608 35559, 78158 35561

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు, RMP&డాక్టర్స్ కావలెను.జీ: 15 వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.7995365999

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

గమనిక